www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 మే 2023
5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

## నేడు యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాలు ఈనెల 8వ తేదీ సోమవారం యథావిధిగా జరుగు తాయని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందన హాల్లో జిల్లాస్థాయిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీదారుల నుంచి విజ్ఞాపనలు స్వీకరిస్తారని అన్నారు. అదేవిధంగా డివిజన్, మండల కార్యాలయాల్లోనూ స్పం దన కార్యక్రమాలు యథావిధిగా ఉంటాయని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు గంటలు నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య అర్జీదారుల నుంచి విజ్ఞాపనలు స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

▸ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

రాబోయే రెండు రోజులలో మరో తుఫాన్ రాబోతున్నట్లు వాతావరణ శాఖ పేర్కొన్న నేపథ్యంలో రైతులంతా తమ పంట పొలాల్లోని ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ఆదివారం స్థానిక మండల పరిధిలోని అంబాజీ పేట మండలం కె.గంగలకుర్రు అగ్రహారం, ఇరుసు మండ గ్రామాల్లో వరి పంట క్షేత్రాల్లోని ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసి దెబ్బతిన్న ధాన్యం రాశులను క్షేత్రస్థాయిలో వరి పంట క్షేత్రాల్లో వరిగడ్డిని చుట్టే ప్రక్రియను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో పశుగ్రాసం కొరత ఇబ్బందులు తలెత్తకుండా రబీలో పండిన వరి గడ్డిని చుట్టే స్ట్రాబెలర్ యంత్రంతో గ్రాస్ బండిల్ తయారీ విధానం ద్వారా వరిగడ్డిని సేకరించి నిల్వలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది గోదావరి వరదలు ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో పశుగ్రాస కొరత ఏర్పడిన దృష్ట్యా ఆ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ముందు గానే పశుగ్రాసాన్ని సేకరించి నిల్వ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసు బాబు నాగేశ్వరరావు, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.ముక్కంటి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ యస్.సుధా సాగర్, తహశీల్దార్ టి.మంగతాయారు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐ.రత్నరాజు క్షేత్రస్థాయి అధికారులు గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**రామచంద్రపురం** రైతులు పండించిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు మిల్లులకు తరలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన చంద్ర ఆదేశించారు.ఆయన ఆదివారం కె.గంగవరం మండలంలోని దంగేరు, పామర్రు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రవాణా అవుతున్న ధ్యాన్యాన్ని పరిశీలించారు. మళ్లీ తుఫాన్ కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు ధాన్యాన్ని వీలైనంత త్వరగా మిల్లులకు సరఫరా చేయాలన్నారు. లేకుంటే టార్పాలిన్‌తో ధాన్యాన్ని కప్పి భద్రపరచు కావాలని రైతులకు సూచించారు. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ వైద్యనాథ శర్మ వ్యవసాయాధికారి బలుసు రవి తదితరులు ఉన్నారు. **కపిలేశ్వరపురం** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జెసి ధ్యాన చంద్ర పర్యటించారు. ఆయన టేకిలో ఆర్‌బికె ద్వారా రైసు మిల్లులకు ధాన్యం తోలించిన వివరాలను అధికారులను, రైతులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించిన తరలించాలని, నిబంధనల మేరకు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. రైతులకు సాంకేతిక ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు పర్యటించాలన్నారు. రైతులతో మాట్లాడిన జెసి వారి కోరిక మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. జెసి వెంట తహశీల్దార్ కె.సూర్యారావు, ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి, ఎఒ రమేష్ కుమార్, సచివాలయ సిబ్బంది, రైతులు ఉన్నారు.



అంబాజీపేట మండలంలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా



పామర్రు లో ధాన్యం ఎగుమతులు పరిశీలిస్తున్న జెసి ధ్యానచంద్ర

**ధాన్యం ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తాం**

**రామచంద్రపురం** రైతుల నుండి తడిసిన మొలకలు వచ్చిన ధాన్యం ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తామని రామచంద్రపురం ఆర్‌డిఒ సింధు తెలియజేశారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఉన్న కె.గంగవరం మండలం లో ఆదివారం పర్యటించారు. అకాల వర్షాలు కారణంగా తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసి రైస్ మిల్లులకు లోడ్ చేయించి, దిగుమతి చేయించి రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బంది ఆర్‌బికె సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని ఆర్‌డిఒ ఆదేశించారు. అదేవిధంగా రైస్ మిల్లుల యాజమాన్యం మాన వతా దక్పథంతో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో రైతులు వద్ద కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, ఆర్‌బికె, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెరిట్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-యంత్రాంగం

టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అధికారులు, నాయకులు ఆదివారం అభినందనలు తెలిపారు. వివరాలు ఇవి..

**మండపేట**టెన్త్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను డిఇఒ కమలకుమారి ఆదివారం అభినంది ంచారు. రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన పుట్టా సాయి శ్రావణి, జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన కోనాల వెంకట వినయ్‌లను డిఇఒ అభినందించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో డిఇఒ కమల కుమారి పాల్గొని పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించి మిఠాయి తినిపించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ షాలెం రాజు, ఎంఇఒ నాయుడు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి** ఈ నెల మే6న విడుదలైన టెన్త్ ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాల్లో ఉత్తీర్ణత శాతం రావడంపై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదుటి శిరీష్ హర్షం వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలో ఉన్నత నిర్ణయాలతో సిఎం జగన్ చేపడుతున్న కార్యక్రమాలు నాడు-నేడు పథకం ద్వారా పేద విద్యార్థుల చదువు కొరకు అందించిన చేయూత ఫలితంగా పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలిగారని అన్నారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. **మామిడికుదురు(పి.గన్నవరం)** పదవ తరగతి పరీక్ష ఫలితాలలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నరేంద్రపురం గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు 80శాతం ఉత్తీర్ణత సాధించినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన 70 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 56 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. తమ పాఠశా లకు చెందిన గిడ్డి చందు 555, కుసుమే లోకేష్ 546, జల్లి దినేష్ 528, మట్టపర్తి బాలసత్య సాయి ప్రదీప్ 526, తరిట్ల ప్రదీప్ 506 మార్కులు సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ శ్రీనివాసు,డిసిఒ అంగిడి మురళీకృష్ణ, మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.



మండపేటలో విద్యార్థి వెంకటేష్‌ను అభినందిస్తున్న డిఇఒ కమలకుమారి

# నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం

ప్రజాశక్తి - ఆలమూరు

నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని కొత్తపేట ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని నవాబుపేటలో ధాన్యం రాశులను ఆదివారం ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రైతులతో మాట్లాడుతూ సిఎం జగన్ తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. గ్రామ స్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ అధికారులతో నిరంతరం మాట్లాడుతున్నామని అన్నారు. రైతులు నష్టపోకుండా మిల్లర్లతో మాట్లాడి ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎక్కడైనా అలసత్వం ప్రదర్శిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని ఆదేశించామని తెలిపారు. గత ప్రభుత్వంలో అకాల వర్షాలు, ప్రకతి వైపరీత్యాల వలన నష్టపోయిన రైతులు పరిహారం కోసం వేచిచూడవలసిన పరిస్థితి ఉండేదన్నారు. సిఎం జగన్ రైతులకు పంటల బీమా అమలు చేసి పంట నష్టం సంభవిస్తే త్వరితగతిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. రైతు భరోసా ద్వారా భూములు ఉన్న రైతులకే కాకుండా కౌలు రైతులకు కూడా ఆర్థిక సహాయం అందజేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు దియ్యన పెద్దకాపు, జాంపోలు మాణిక్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయకపోతే పోరాటం

ప్రజాశక్తి-మండపేట

72 గంటల్లో ధాన్యం కొనుగోలుచేయకుంటే రైతుల పక్షాన ప్రత్యక్ష పోరాటం చేస్తామని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం రాయవరం మండలంలో సోమేశ్వరం, లొల్ల, రాయవరం, వెదురుపాక, వెదురుపాక సావరం గ్రామాల్లో మొలకొచ్చిన ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. రైతులను కలిసి ఇబ్బందులను తెలుసుకున్నారు. రోడ్డుమీద ఎండబెట్టిన ధాన్యాన్ని తహశీల్దార్ తీసేయమంటున్నారని పొలంల నీరు ఉండిపోయి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న మని రైతులు అన్నారు. అనంతరం ఎంఎల్ఎ వేగుళ్ల తహశీల్దార్‌కు ఫోన్ చేసి ధాన్యాన్ని ఆర్‌బికె సెంటర్లకు తరలించడానికి ఏర్పాట్లు చేయమన్నారు. రోడ్డుమీద ఆరబోసిన ధాన్యం తీసేయమని ఎవరైనా బెదిరిస్తే తనకి ఫోన్ చేసి చెప్పమని ఎంఎల్ఎ అన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -మామిడికుదురు

మామిడికుదురు హైస్కూల్ ఆవరణలో 1987 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రస్తుత హైస్కూల్ హెచ్ఎం నిరంజని అధ్యతన ఈ కార్య క్రమం నిర్వహించారు. 36. ఏళ్ల తరువాత ఒకచోట కలుసుకున్న వీరంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. తమకు పాఠాలు నేర్పిన గురువు లను సత్కరించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అందరూ కలిపి భోజనాలు చేసి సంతోషంగా గడిపారు. కార్యక్రమములో నై నాల వెంకటరత్నం, ఈలి విఠల్,శ్రీదేవి, శ్యామల, పద్మ, మంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు తదితరులు

## నాగుల చెరువుకు బస్సు సౌకర్యం కోసం వినతి

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం


నాగుల చెరువు గ్రామానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ సర్పంచ్ వాసంశెట్టి సత్యనారాయణ అధికారులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగుల చెరువు గ్రామానికి రహదారి సౌకర్యం ఉన్న శివారు ప్రాంతం కావడంతో ఆర్‌టిసి అధికారులు ఇప్పటి వరకు బస్సు సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగుల చెరువు గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు చదువుల నిమిత్తంవెళ్లే విద్యార్థులు ,ప్రయాణికులకు బస్సు సౌకర్యం లేక పలు అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో ఇదే సమస్యను అనేకసార్లు అధికారుల దష్టికి తీసుకు వెళ్లినప్పటికి ఫలితం లేకపోయిందన్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి నాగుల చెరువు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులు, ప్రయాణికులు, అవస్థలు తొలగించాలని సర్పంచ్, గ్రామస్తులు కోరుతున్నారు.

## చిన్నారులకు పోషకాహార కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురంలో వైసిపి నాయకుడు వంటేద్దు వెంకన్న నాయుడు పుట్టినరోజు సందర్భంగా హెచ్ఐవి బాధిత చిన్నారులకు పోషకాహార కిట్ల పంపిణీ జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా వికలాంగుల అధ్యక్షులు, వైసిపి నాయకులు వంటెద్దు వెంకయ్య నాయుడు ఫాలోయర్స్ చే కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో శ్రీనివాస్, ఆకుల బాలాజీ, తిక్క బాబి, నల్ల హేమంత్, చీకట్ల చిన్నసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కార్టూ'నిజం'



# మన్యం వీరునికి ఘన నివాళి



రావులపాలెంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

ప్రజాశక్తి-యంత్రాంగ

విప్లవవీరుడు, స్వాతంత్ర్యసమరయోధుడు అల్లూర సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆదివారం ప్రజాప్రతినిధులు, కార్మికులు ఆయన ఘన నివాళులు అర్పించారు.

**రామచంద్రపురం** అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామం లో అల్లూరి పాత్ర మరువలేనిదని అన్నారు. అల్లూరి స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వై సి పి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తపేటలో అల్లూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

**మండపేట** అల్లూరి సీతారామరాజు వర్ధంతి మండలంలోని ద్వారపూడి గ్రామంలో రైస్ మిల్ జట్టు నాయకులు గొనిశెట్టి నాగేశ్వరరావు, కశిరెడ్డి సోమరాజులు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. అల్లూరి విగ్రహానికి పలువురు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఆశయాలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. సామాన్య వాదులకు దేశాన్ని కార్పొరేట్ కంపెనీలకు ప్రజల సంపదను దారాదత్తం చేస్తున్న ప్రస్తుత సమయంలో అల్లూరి ఆశయాలే దేశానికి శరణ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జమ్ము ఈశ్వరరావు, గౌరీ నాయుడు, బిట్రా సత్తిబాబు, చిన్న వెంకటేశులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు పోరాటస్ఫూర్తి, దేశభక్తి నేటి యువతకు ఆదర్శం కావాలని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆదివారం అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో రావులపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమానికి ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పాఠశాల ఆవరణలో గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అల్లూరి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అల్లూరి స్మృతి చిన్నంగా తన నియోజకవర్గ పరిధిలోని ఆత్రేయపురంలో రూ.కోట తో ఒక పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కర్రి లక్ష్మీవీరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కర్రి నాగిరెడ్డి, మహాత్మా గాంధీ అధ్యయన సంస్థ అధ్యక్షులు పోతంశెట్టి కనికిరెడ్డి, కార్యదర్శి దుళ్ళ వెంకటేశ్వర్లు, సుధాకర్, సంస్థ ఉపాధ్యక్షుడు సఖినేటి వాకులరాజు, వెలగల సత్తిరెడ్డి, దండు సుబ్రహ్మణ్యవర్మ, గాదిరాజు ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా ఆత్రేయపురం రావి చెట్టు సెంటర్లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మాజీ ఎఎంసి మాజీ ఛైర్మన్ ముదునూరు రామరాజు మాజీ ఎంపిపి పిఎస్.రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నంబూరి వెంకటరామరాజు, గాదిరాజు ప్రసాద్ రాజు, ముదునూరి వెంకట నాగరాజు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్రం వస్తుందని నమ్మి, ఆ పోరాటంలోనే దేశం కోసం చిన్న వయసులోనే ప్రాణాలు అర్పించారని పలువురు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కొత్తపేటలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, పల్లి ఏసు, ముత్యాల బాబ్జి, బూసి విష్ణుమూర్తి, కంచుస్తంభం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలోఅల్లూరి చిత్రపటం నివాళులర్పిస్తున్న మంత్రి వేణుతదితరులు




ద్వారపూడిలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్మికులు

## నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - కాట్రేనికోన

కాట్రేనికోన, కందికుప్ప శాఖా గ్రంథాలయాల నందు ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంపు ) నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారులు కె. తులసి లక్ష్మి, వి.శ్రీహరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యార్థులు వేసవి విరామాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఎపి పౌర గ్రంథాలయ శాఖ వారి ఆధీనంలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న శాఖా గ్రథాలయాల్లో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరం లో భాగంగా కథలు వినుట, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెపప్పుట, చిత్ర లేఖనం, పేపర్ ఆర్ట్ వంటి సజనాత్మక కార్యక్రమాలు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ఈ వేసవి శిబిరాలకు హాజరై సజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు.

## ఆలయాల నిర్మాణానికి మంత్రి భూమిపూజ

ప్రజాశక్తి-రామచంద్రపురం

వెల్ల , ఒదూరు గ్రామాల్లో దేవాదాయ శాఖ నిధులతో నిర్మించుకోనే ఆలయాలకు మంత్రి వేణు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల మనోభావాలకు అనుగుణంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అందులో భాగంగా ధార్మికపరమైన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వెల్ల గ్రామం తో పాటు ఒదురు గ్రామంలో శిథిలమైన రామాలయాల స్థానే నూతన రామాలయాల నిర్మాణానికి ప్రభుత్వ సహాయంతో పాటు స్థానికులు ముందుకు రావడంపై మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఎంపిపి అంబటి భవాని, వెల్ల సర్పంచ్ సూరిబాబు, వెల్లబ్బు, ప్రజాప్రతినిధులు పాల్గొ న్నారు.

## అయినవిల్లి ఆలయంలో పలువురు పూజలు

ప్రజాశక్తి-అయినవిల్లి

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించారు. కడప మున్సిపల్ కమిషనర్ గోకరకొండ ఎస్ఎస్ ప్రవీణ్ చందు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించి, అన్నదాన నిధికి విరాళంగా రూ.10,116 అందించారు. ఎపి స్పోర్ట్స్ వెల్ఫేర్ ఐజి కె.రంగారావు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించారు. తెలంగాణ హైకోర్టు జడ్జి సి వి భాస్కర్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించారు. వీరికి అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసిచ శేష వస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటమును అందజేశారు.

# విద్యార్థినులకు దాతల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉన్నత చదువుల కోసం విద్యార్థినికి, ప్రమాదంలో గాయపడిన విద్యార్థినికి పలువురు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇవి..

**మండపేట** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బీటెక్ విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక సత్య శ్రీ రోడ్డులోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో రాజా నగరంలోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని కొప్పిశెట్టి భార్గవి బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని ఉన్నత చదువు నిమిత్తం మండపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని క్లబ్ అధ్యక్షులు గుండు వీర తాతరాజు చేతుల మీదుగా అందజేశారు. ఆర్థిక ప్రోత్సాహం అందించిన మండపేట లయన్స్ క్లబ్ సభ్యులకు అమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమ ంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎల్‌వి.నాగేంద్రబాబు, చెన్నా రాంబాబు, లయన్ కొనే వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

**ఆలమూరు** ప్రమాదశాస్తు తీవ్ర గాయాల పాలైన ఒక విద్యార్థిని పరిస్థితికి ఆదివారం స్పందించి స్థానిక ఎస్ఐ ఎస్.శివప్రసాద్ రూ.10వేలు సాయం అందించారు. సూర్యారావుపేటకు చెందిన విద్యార్థిని వాసంశెట్టి అనంతలక్ష్మి ఇటీవల ప్రమాదవశాత్తూ మేడపై నుంచి కింద పడటంతో కాళ్లకు ముఖానికి తీవ్రమైన గాయాలు అయ్యాయి. ఆ బాలిక తండ్రి సాధారణ కూలీ కావడంతో వైద్యం చేయించుకోవడానికి దాతల ఆర్థిక సాయాన్ని స్థానిక మీడియా ద్వారా కోరారు. తన వద్దనున్న కొద్దిపాటి ధనంతో వైద్యం చేయించినా ఫలితం లేకపోయిందని ఆ బాలికకు మరింత మెరుగైన వైద్యం చేయించాలని వైద్యులు తెలపడంతో దాతలు బాలిక తండ్రి సుబ్బారావు ఫోన్ పే 90008 93850 నెంబర్‌కు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆలమూరు ఎస్ఐ ఎస్.శివప్రసాద్ ఆ బాలికకు మెరుగైన వైద్యం అందించాలని రూ.10 వేలను బాలిక తండ్రికి ఫోన్ పే ద్వారా అందజేశారు.



విద్యార్థినికి సాయం అందజేస్తున్న తాతరాజు తదితరులు

# స్నేహభావాన్ని పెంపొందించేందుకు కృషి

ప్రజాశక్తి -అమలాపురం

కాపు, దళిత, బిసి, మైనారిటీల మధ్య ఆత్మీయతా స్నేహభావం పెంపొందించేందుకు కృషి చేయాలని కాపు నాయకులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నల్లా విష్ణుమూర్తి అన్నారు. అమలాపురంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎఐసిసి కో-ఆర్డినేటర్ మెంబర్ బిఆర్‌కె.నాయుడు స్వగృహంలో విష్ణుమూర్తి అధ్యక్షతన కాపు, దళిత, బిసి, మైనారిటీల ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఐక్య కాపునాడు అధ్యక్షులు వర్ధినీడి నరసింహరావు మాట్లాడుతూ కోనసీమ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. రైల్వే లైన్ కోసం సంఘ నాయకులంతా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. కాపు నాయకులు పబ్బినీడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇకపై ఈ వేదికలో ప్రజా సమస్యలపై స్పందించాలన్నారు. సమావేశంలో కాపు నాయకులు ధూళిపూడి చక్రం, పట్టణ అధ్యక్షులు ఒంటెద్దు బాబి, పత్తి దత్తుడు, జక్కంపూడి సత్తిబాబు ఎస్‌సి నాయకులు వడ్డి నాగేశ్వరరావు, డిజె.ప్రభాకర్, దేవరపల్లి రాజేంద్ర బాబు, బిసి నాయకులు రాయుడు రమణ, ముల్లేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ ఛైర్మన్ విష్ణుమూర్తి

## ఉపాధి కూలీలు సాయం అందించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

రైతులకు ధాన్యం ఆరబోసేందుకు ఉపాధి కూలీలు సాయం అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశామని జొన్నాడ పిఎసిఎస్ ఛైర్మన్ తాడి మెహర్ ఆదిత్య రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వర్షాలకు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ధాన్యం రోడ్లపైనే రాశులుగా పోశారని అన్నారు. వాటిని ఆడబెట్టేందుకు రైతుల అభ్యర్థన మేరకు బరకాలు ఏర్పాటుచేసి ఉపాధి కూలీలతో సహాయం అందించాలన్నారు. స్థానిక అధికారులు తక్షణం స్పందించి రైతులకు ఉపాధి కూలీ లను ఏర్పాటు చేయాలన్నారు

## నేరాలు ఘోరాలు

### కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని వికె.రాయపురంలో ఆదివారం ఒక వ్యక్తి నుంచి పందేల్లో కోళ్లకు వినియోగించే 42 కోడి కత్తులను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు సామర్లకోట పోలీసులు తెలిపారు. మల్లిరెడ్డి సూరిబాబు దగ్గర నుంచి కోడిపందేలకు ఉపయోగించే సుమారు 42 కోడి కత్తులను సీజ్ చేసి అతని మీద కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

### చెరువులో పడి మహిళ మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మహిళ మతి చెందిన సంఘటన ఇది. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా అరకు మండలం బొండం గ్రామానికి చెందిన బీరవర్త శుక్ర తన భార్య జానకి(48)తో వలస వచ్చి ఎన్.కొత్తపల్లిలో భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెంకు చెందిన రైతు చీకట్ల దుర్గాప్రసాద్ రొయ్యల చెరువుల వద్ద మూడేళ్లుగా పని చేస్తున్నాడు. యజమాని దుర్గాప్రసాద్ చెరువుల వద్ద ఆవు కనిపించకపోవడంతో శనివారం రాత్రి సమయంలో జానకి ఆవును వెతుక్కుంటూ వెళ్ళింది. ప్రమాదవశాత్తు పక్క రైతు బొడ్డు వీర వెంకట సత్యనారాయణ రొయ్యల చెరువులో జారిపడి మతి చెందినట్టు భర్త శుక్ర తమకు ఆదివారం ఫిర్యాదు చేశాడన్నారు. జానకికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

### పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి-జగ్గంపేట

జగ్గంపేట మండల పరిధిలోని పలుచోట్ల పేకాట శిబిరాలపై దాడి చేసి పలువురినీ అదుపులోకి తీసుకున్నట్టు జగ్గంపేట ఎస్ఐ సూర్య అప్పారావు తెలిపారు. కాండ్రేగుల సమీపంలో జీడి మామిడి తోటలో రహస్యంగా పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.12,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మామిడాడలో మరో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్టు జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని సోమవారం కోర్టుకు పంపుతామన్నారు. వీరి వద్ద నుంచి రూ.2,000 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.



విద్యుదాఘాతంతో మృతి చెందిన పాడిగేదె

### విద్యుదాఘాతంతో పాడి గేదె మృత్యువాత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాడిగేదె విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. ధవళేశ్వరంలోని స్థానిక సదరన్ డ్రగ్స్ వెనుకన ఉన్న పొలంలో గడ్డి మేసేందుకు వెళ్లిన పాడి గేదె విద్యుదాఘాతానికి గురైంది. చిన్నకర్రలు కట్టి విద్యుత్ వైర్లను లాగారు. వీటికి తగలడంతో గేదె మృత్యువాత పడింది. గతంలో కూడా ఇదే విధంగా ధవళేశ్వరంలోని బ్యారేజీ క్వార్టర్స్‌లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుదాఘాతానికి గురై పాడిగేదె మృత్యువాత పడింది. ఇప్పుడు మరో గేదె ఇలాగే మృతి చెందడంతో యజమానికి వాపోతున్నాడు. పాడిగేదెలతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, రెండు గేదెలు చనిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయాడు.

### రౌతులపూడికి పోలీస్ స్టేషన్ మంజూరు

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడికి త్వరలోనే పోలీస్ సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రమైన రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ కోసం ప్రభుత్వ భవనాలను ఆదివారం ఆయన పరిశీలించారు. మండలానికి పోలీస్ స్టేషన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇటీవల జిఒ జారీ చేసినట్టు తెలిపారు. ఆయన వెంట ప్రత్తిపాడు సిఐ కిషోర్ బాబు ఉన్నారు.



ఠాగూర్‌కు నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

### విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చిరస్మరణీయుడు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

దేశానికి జనగణమన జాతీయ గీతాన్ని అందించిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చిరస్మరణీయులని ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఠాగూర్ బాలల హృదయాలను వికసింపజేయడానికి ప్రాచీన మునుల గురుకులాల తరహాలో శాంతి నికేతన్‌గా పేరుగాంచిన విశ్వ భారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, ఉంగరాల వెంకటేశ్వరరావు, రాజా, ఎస్. శ్రీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో విద్యార్థులకు ఆటపాటలు

## గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్






ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వేసవి సెలవుల్లో ఆటలు, పాటలు, విజ్ఞానాన్ని పంచేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి గ్రంథాలయాలు సిద్ధమవుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిఎల్ఎన్ఎస్‌వి.ప్రసాద్ అన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని అన్ని శాఖల్లో ఈ నెల 8 నుంచి కార్యక్రమాన్ని అమలు చేయనున్నామని తెలిపారు. 10 నుంచి 15 ఏళ్ల లోపు బాల బాలికలంతా వీటిని సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను ఆయన వివరించారు.

**శిక్షణా శిబిరాలకు ఏయే ఏర్పాట్లు చేస్తున్నారు..**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 102 ప్రభుత్వ గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో 57 లైబ్రరీలకు సొంత భవనాలుండగా, 14 అద్దె భవనాల్లో, 31 ఉచితంగా ఏర్పాటు చేసిన భవనాల్లో నడుస్తున్నాయి. వేసవి శిక్షణా శిబిరాలను 85 గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్నాం.

గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. సమీపంలోని విద్యార్థులను రప్పించి రోజూ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తాం. ముఖ్యంగా పిల్లలకు విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలు, మానసిక వికాసానికి ఆటపాటలు నిర్వహిస్తాము. ఒక్కో గ్రంథాలయంలో సగటున 50 మంది వరకు వచ్చి వీటిని వినియోగించుకుంటారు. సోమవారం నుంచి మొదలయ్యే శిక్షణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేశాం. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వీటిని నిర్వహిస్తారు.

**శిక్షణ తరగదులు ఎలా నిర్వహిస్తారు.?**

ఉదయం 8 గంటల నుంచి 8:30 వరకు కథలు వినడం, 8:30 గంటల నుంచి 10 గంటల వరకు పుస్తకాలు చదవడం, తర్వాత పది నిమిషాలు విరామం అనంతరం 10:30 వరకు చదివిన అంశాలపై సమీక్ష ఉంటుంది. 10:30 నుంచి 11 గంటల వరకు కథలు చెప్పడం ఉంటుంది. 11 గంటల నుంచి 12 గంటల వరకూ స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, డాన్స్‌లు, పేపర్ క్రాఫ్ట్, బొమ్మల తయారీ, నాటికల పోటీలు, ఆటలు, ముఖ్యమైన ప్రతినిధులతో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఉంటాయి.

**పిల్లలను ఏ విధంగా ప్రోత్సహిస్తారు..**

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే కరపత్రాలు, గోడప్రతులు ఇచ్చి అందరికీ తెలిసేలా ప్రచారం నిర్వహించాం. వేసవి శిక్షణ, ఆట పాటల్లో పాల్గొనే విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు సర్టిఫికెట్లతోపాటు, ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తాం. దీని కోసం గ్రేడ్ 1 గ్రంథాలయాలకు రూ.15 వేలు, గ్రేడ్ 2కు రూ.12 వేలు, గ్రేడ్ 3 కు రూ.10 వేలు చొప్పున కేటాయిస్తున్నాం. ఇవి కాకుండా దాతల సహకారం కూడా తీసుకుంటున్నాం.

**ఏయే అంశాలపై శిక్షణ ఉంటుంది..**

పఠనం, సరదా అనే రెండు విభాగాల్లో శిక్షణ ఉంటుంది. కథలు వినడం, చెప్పడం, గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం, వాటిపై సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, పెయింటింగ్, పేపర్ ఆర్ట్, సంగీతం, నత్యం, చదరంగం, క్యారమ్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తాం. జరిగిన కార్యక్రమాలపై ప్రతి వారం సమీక్ష, చర్చ నిర్వహిస్తారు. మొత్తంగా విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా ఉంటాయి.

## యానాం వార్తలు

### ప్రభుత్వాసుపత్రిలో పని చేయని ఎక్స్‌రే

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఎక్స్ రే యంత్రం పని చేయక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న యానాం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ అర్ధాని దినేష్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఎక్స్ రే మిషన్ పని చేయక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు కానీ స్థానిక నాయకులు కానీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. దీనిపై ప్రభుత్వ ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రవిశంకర్‌ను వివరణ కోరగా ఉన్నత అధికారులకు తెలియజేశామని త్వరలో సమస్య పరిష్కారం చూపుతామన్నారన్నారు. ఈ సమస్యను పుదుచ్చేరి ఎంపీ వైద్య లింగంకు ఫోన్లో తెలపగా ఆయన సానుకూలంగా స్పందించి ఎంపీ నిధులు ఏర్పాటు చేస్తామన్నారన్నారు.




అల్లూరికి నివాళులర్పిస్తున్న పరిపాలనాధికారి, సిబ్బంది

### అల్లూరి సీతారామరాజుకు పలువురి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ప్రాంతీయ పరిపాలన అధికారి ఆర్.మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్, సిఐ షణ్ముగం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి రామలింగేశ్వరరావు, రామరాజు, సుబ్బరాజు, చెల్లి గోపీనాథ్, చెక్కల అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్‌సిలో శ్రీసిద్ధార్థ ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ సంస్థ విద్యార్థులు విశేష ప్రతిభ ఘనపరిచారని శ్రీసిద్ధార్థ విద్యానికేతన్ కరస్పాండెంట్ ఎస్‌కె.విశాలాక్షి శేఖర్ రాజు, ప్రిన్సిపల్ కె.చక్రపాణి తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. నూరు శాతం ఫలితాలు సాధించగా విద్యార్థి భరత్ 600/547 మార్కులతో టాపర్‌గా నిలిచాడన్నారు. రాజశ్రీ 520, సౌమ్య 495, 400 దాటి తులసి, లిల్లీ గ్రేస్, జయరాజ్, సాయి చరణ్, దినేష్ కుమార్, శాలిం ప్రదీప్, సాయి మణికంఠ, మేఘన చంద్రకళ, భువనేశ్వరి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల, మంజు, ఉష, జ్యోతి మౌనిక పాల్గొన్నారు.

**గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ**

తాళ్లరేవు మండలం చొల్లంగిపేట డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు 10లో ఉత్తమ ప్రతిభ సాధించినట్లు ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన పి.నిరీష (555 స్కూల్ ప్రథమ) వై.అనూష (530 ద్వితీయ) ఎస్.స్వాతి (528 తృతీయ)లను ఎంఇఒ సంజీవరావు, జిల్లా సమన్వయకర్త ఎ.మురళీకృష్ణ, ఉపాధ్యాయినులు అభినందించారు.



కాకినాడ రూరల్‌లో శ్రీ సిద్ధార్థ విద్యార్థులతో అధ్యాపకులు

## పట్టాల పంపిణీపై తప్పడు ప్రచారం తగదు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం చిన్నస్వామి నగర్‌లో పేదలకు అందించే ఇళ్ల పట్టాల పంపిణీ వ్యవహారంలో తమపై టిడిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని వైసిపి నాయకులు అన్నారు. ఆదివారం రూరల్ మండలం చిన్నస్వామి నగర్‌లో కరాటి రాము, ఆకుల సత్తిబాబు, ఎఎంసి డైరెక్టర్ కోరాడ అరుణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2016లో అప్పటి టిడిపి ప్రభుత్వంలో స్వామి నగర్ ప్రాంతంలో 63 మంది పేదలకు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని చెప్పారు. దాన్ని 93 పట్టాలు చేశారన్నారు. ఈ విషయంపై రూరల్ తహశీసిల్దార్ స్వామి నగర్ వచ్చి పట్టాల విషయాన్ని తనిఖీ చేయగా సామాజిక స్థలం, వాటర్ ట్యాంక్, పార్కు స్థలములను పరిశీలించారన్నారు. ఆ స్థలాన్ని తాము ఆక్రమించుకొని పట్టాలు సృష్టించామని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

## వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల తీవ్రంగా పంట నష్టం వచ్చిన రైతులను, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలనీ, నీట మునిగిన పంట రైతు భరోసా కేంద్రాల ద్వారా త్వరతగతిని కొనుగోలు చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి డిమాండ్ చేశారు. కరప, వలసపాకల, వేళంగి శివారు కొప్పిశెట్టి వారిపేట, యండమూరు శివారు ఒడ్డుపాలెంలో నీట మునిగిన పంట పొలాలను ఆదివారం స్థానిక నాయకులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవి కాలం దష్యా వర్షాలు రావని అనేకమంది రైతులు కాస్త ఆశ్రద్ధ కారణంగా నేడు భారీ స్థాయిలో పంట నష్టం వచ్చిందని, ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు సూచించక పోవటం రైతు భరోసా కేంద్రాలలో సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవటం వల్ల చిన్న సన్నకారు రైతులకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. బుంగ సింహాద్రి, గుల్లిపల్లి శ్రీనివాస్, కాకర్ల బుజ్జిబాబు, జమిందార్, గంజా రాంబాబు, మద్దూరి స్వామి పాల్గొన్నారు.

## నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని చంద్రంపాలెం దేవులపల్లి కృష్ణశాస్త్రి మండల పరిషత్ పాఠశాలలో నెల రోజులు నిర్వహించే సమ్మర్ జూడో శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించనున్నట్టు ఉప్పరగూడెం జెడ్‌పి హైస్కూల్ పీడీ కె.వీరబాబు చెప్పారు. విద్యార్థుల్లో శారీరక ధారుఢ్యాన్ని, పోటీతత్వాన్ని పెంపొందించే సంకల్పంతో నెల రోజులపాటు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య, చంద్రంపాలెం, ఉప్పరిగూడెం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచి, గ్రామపెద్దలు హాజరవ్వనున్నట్లు చెప్పారు.

## మేడే స్ఫూర్తితో హక్కుల పరిరక్షణ

ప్రజాశక్తి-కాకినాడ

మేడే స్ఫూర్తితో హక్కుల పరిరక్షించుకోవాలని పలువురు నాయకులు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వారోత్సవం లో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ రాగంపేట వడ్డి పోలమాంబ గుడి సెంటర్ లో శనివారం బహిరంగ సభ నిర్వహించారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్ మాట్లాడుతూ 137వ మే దినోత్సవాన్ని కార్మిక వర్గం జరుపుకుంటోందన్నారు. ప్రత్యేకంగా మనదేశంలో మే దినోత్సవం 1923 ప్రారంభమై నేటికి వందేళ్లు పూర్తయిందన్నారు. కేంద్రం ప్రభుత్వం కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే విధంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందన్నారు. దీని ద్వారా ఎనిమిది గంటల పని విధానాన్ని మార్పు చేసి 12 గంటలు పని విధానం తీసుకురావాలని చూస్తోందన్నారు. కార్మిక వర్గంతో పాటు ప్రజలపై కూడా నిత్యం విపరీతమైన భారాలు వేస్తూ నిత్యావసర వస్తువుల ధరలను రోజురోజుకు పెంచుకుంటూ పోతోందన్నారు. దీనివల్ల సామాన్య జనం ఆర్థిక ఇబ్బందులు తో కుటుంబాలు సతమతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర నిర్ణయాలను ఎపి ప్రభుత్వం అమలు చేయడానికి ముందుకు వెళుతోందన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రజలకు కార్మిక వర్గానికి నష్టం కలుగుతున్నా లెక్కచేయకుండా కేంద్ర విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని విమర్శించారు. ఈ మేడే స్ఫూర్తితో కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ అమలు కోసం, కనీస వేతనం రూ.26 వేలు సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకట రమణ, నగర ఉపాధ్యక్షుడు మేడిశెట్టి వెంకట రమణలు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులు కాపాడుకోవాలని, మరింత ఐక్యంగా కార్మిక వర్గం ఉద్యమాలు నిర్వహించాలన్నారు.

ప్రజానాట్యమండలి కళాకారులు లోవరాజు బృందం ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. పెద్దాపురం కళాకారులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కష్ణ, గీతాంజలి బృందం దేవి ఆలపించిన గీతాలు అలరించాయి. దారపురెడ్డి సత్యనారాయణ, దూలపల్లి అర్జున్‌ల డప్పుల వాయిద్యం మోత మోగించింది. కార్యక్రమంలో జిజిహెచ్ శానిటేషన్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయ్ కుమార్, నాయకులు వాసు, మంగతాయారు, తలుపులమ్మ, పుష్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బంగారు సత్తిబాబు, నాయకులు జలగడుగుల శ్రీనివాస్, యరంశెట్టి దొరబాబు, భవిరిశెట్టి గురుమూర్తి, యరంశెట్టి నాగబాబు, ఫ్యాబ్రికేషన్ యూనియన్ నాయకులు బివి.రమణ, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎన్ ఈశ్వరి పాల్గొన్నారు.




కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు నాయకులు

## జగన్ పాలనలో శెట్టిబలిజలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి- తాళ్లరేవు

సిఎం జగన్ పాలనలో శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. ఎఎంసి ఛైర్మన్‌గా ఆయన పదవి పొందిన సందర్భంగా యానం శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుంకరపాలెంలోని శంకర్ రెసిడెన్సీలో చీకట్ల సత్యనారాయణ మాస్టారు అధ్యక్షతన జరిగిన శెట్టిబలిజ సంఘ సభ్యులు ఆత్మీయ సమావేశంలో పలువురు శివన్నారాయణను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలోనే తొలిసారిగా రాజ్యసభకు కు పిల్లి సుభాష్ చంద్రబోస్ ను పంపిన ఘనత సిఎం జగన్‌దేనని అన్నారు. అదేవిధంగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మరో ఇద్దరు ఎంఎల్‌సిలకు అవకాశం కల్పించిన సిఎం జగన్‌కు శెట్టిబలిజలు రుణపడి ఉండాలని తెలిపారు. అదేవిధంగా మల్లాడి కష్ణారావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పిల్లి త్రిమూర్తులు, చింతాకుల రామకష్ణ, గుత్తుల జయ రామారావు, మట్టపర్తి లోవరాజు, కడలి సుబ్రహ్మణ్యం, చందాల ఏడుకొండలు, కాకి నాగేశ్వరరావు, రామలింగేశ్వర రావు, పంపన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## సేవలు అందించడమే 'చేయూత' లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆపన్నులకు సేవలు అందించడమే చేయూత సంస్థ లక్ష్యమని ఆ సంస్థ అధ్యక్షులు ఎం.రవికుమార్ తెలిపారు. ఆదివారం చేయూత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా చేయూత ద్వారా సేవలు అందిస్తున్న పలువురిని కాకినాడలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రవి మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 300 మంది రోగులకు నిత్యం భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. రక్తదాన శిబిరాలు, ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపన్నులకు అండగా ఉండడం సంతోషకరంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఈ సేవలను మరింత విస్తతం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి, సహాయ అధ్యక్షులు భాష, సలహాదారుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో చేయూత సంస్థ అధ్యక్షులు రవి తదితరులు

## పోలేరమ్మను దర్శించుకున్న చందన, కందుల

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల గ్రామ దేవత పోలేరమ్మ జాతర ముగింపు సందర్భంగా ఆదివారం వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కందుల దుర్గేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికింది. అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజలకు ఉండాలని చందన, కందుల ఆకాంక్షించారు. దర్శించుకున్న వారిలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, వైసిపి మండల అధ్యక్షులు వై.స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి గిరజాలబాబు, వ్యవసాయ మండలి ఛైర్మన్ ఈలి గోపాలం, ముద్రగడ జమ్మీ, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, తాతపూడి బాబి తదితరులు ఉన్నారు.

## అల్లూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - సీతానగరం

అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా సీతానగరం నాలుగు బొమ్మలు సెంటర్ ఉన్న విగ్రహం వద్ద సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజనగరం నియోజవర్గం ప్రెసిడెంట్ సిద్ది నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు నందమూరి చిట్టి స్వామి, వడ్లమూరి సీతారామరాజు, వేటూరి నానాజీ, కోసూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

తాటిపర్తి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి రంగా విశేషంగా కషి చేశారన్నారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మల రామస్వామి, యువత పాల్గొన్నారు.

## జేగురుపాడులో బైబిల్ మిషన్ పుట్టింటి సభలు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని జేగురుపాడులో రెండు రోజులుగా బైబిల్ మిషన్ పుట్టింటి సభలు జరుగుతున్నాయి. బైబిల్ మిషన్ వ్యవస్థాపకులు ముంగమూరి దేవదాసు అయ్య జన్మించిన జేగురుపాడులో పాస్టర్ సాకా మహిమరాజు ఆధ్వర్యంలో ఈ సభలను నిర్వహిస్తున్నారు. ఈ సభలో ఆదివారం సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సభ నిర్వాహకులు ఎస్.మహిమరాజు, సభ అధ్యక్షులు ఎస్.ఏసుపాదం, పాస్టర్ ఫెలోషిప్ వారు సంయుక్తంగా సర్పంచ్ స్టాలిన్‌ను సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో కరుణాకరణ్, పరంజ్యోతి, జయశీలి, మోజెస్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో శిథిలావస్థకు చేరుకున్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామి పురాతన ఆలయం పునర్నిర్మాణానికి గ్రామ పెద్దలు నడుంబిగించారు. మాజీ సర్పంచ్ మట్టా సత్యనారాయణ దీని కోసం రూ.23.50 లక్షలు విరాళం ప్రకటించారని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.వెంకట్రావు ఆదివారం తెలిపారు. గ్రామంలోని భక్తులు, దాతల సహకారంతో సుమారు రూ.1.50 కోట్లతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. మ్యాచింగ్ సొమ్ముతో కలిపి, దేవదాయ ధర్మదాయ శాఖ సుమారు రూ.80 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఇఒ తెలిపారు. ఈ మేరకు మంజూరు పత్రాన్ని కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మంత్రి అనుచిత వ్యాఖ్యలకు మద్దిపాటి ఖండన

ప్రజాశక్తి-నల్లజర్ల

వెల్పూరులో రైతు తడిసిన ధాన్యాన్ని కొనేవారు లేరని మంత్రి వద్ద వాపోతుండగా అతనిపట్ల మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు ఖండించారు. ఆదివారం తిమ్మన్నపాలెం, చీపురుగూడెం గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుకు మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.34 వేల కోట్ల దళితుల సబ్ ప్లాన్ నిధులను సిఎం జగన్ పక్కదారి పట్టించారన్నారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటి? అని ప్రశ్నించారు. ఒక దళితుడిగా తాను దళితుల సంక్షేమానికి వారి అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చెల్లు పెదరామన్న, కూసంపూడి బుజ్జి, వంట్ల పెదరామన్న, మద్దిపాటి సూర్య చంద్రం, జమ్ముల వీరవెంకటసతీష్ తదితరులు పాల్గొన్నారు

## అధికార పార్టీని ఇబ్బంది పెట్టేందుకే 'బ్లూ మార్చ్'

ప్రజాశక్తి-రావులపాలెం

దళితుల్ని చైతన్య పరిచేందుకు నిర్వహించ తలపెట్టిన బ్లూ మార్చ్‌ని కొందరు స్వార్థపరులు అధికార పార్టీని ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేశారని వైసిపి నేతలు అన్నారు. వైసిపి జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు కప్పల శ్రీధర్, అడా ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్ తదితరులు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్లూ మార్చ్ ని ఎల్లో మార్చ్ గా మార్చే ప్రయత్నం చేశారని గొల్లపల్లి డేవిడ్ ఆరోపించారు. శాంతియుతంగా జరపవలసిన కార్యక్రమాలలో అల్లరి సృష్టించి దళితులను విభజించాలని కుట్ర జరుగుతుందన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ ఏదైనా కార్యక్రమం చేపట్టాలంటే పార్టీలకు అతీతంగా అన్ని పార్టీ లతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని, అలా చేయనప్పటికీ వైసిపి నేతలు మద్దతు తెలిపారన్నారు. చివరకు ఇది టిడిపి కుట్రలో భాగంగా జరుగుతున్నట్లు గ్రహించడం జరిగిందని తెలిపారు.